క్లుప్తంగా

రేపటి నుంచి 'పది' పరీక్షలు

ఇబ్రహీంపట్నం: పదోతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 2,320 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 9 పాఠశాలల్లో 11 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న 'పది' పరీక్షలకు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ (బాలికలు), శాస్త్రా హైస్కూల్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, ఇండియన్ పబ్లిక్ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ పాఠశాలల్లో ఒక్కొక్క పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టీఆర్ఆర్, గురుకుల విద్యాపీఠ్ పాఠశాలల్లో రెండేసి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఈ పరీక్ష సమయం ఉంటుంది. ఏప్రిల్ 2వ తేదీ వరకూ ఈ పరీక్షలు కొనసాగుతాయి.

మొండి బకాయిలు చెల్లించండి

ఏపీఎం శ్రీదేవి

తలకొండపల్లి: పొదుపు మహిళా సంఘాలు బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను మహిళలందరు ఈ నెల 22 లోగా చెల్లించాలని ఏపీఎం శ్రీదేవి అన్నారు. అసలు, వడ్డీతో సహా మొత్తం రుణాన్ని చెల్లించి క్లియర్ చేసుకోవాలని సూచించారు. శనివారం మండల పరిధిలోని చంద్రధన, సంఘాయిపల్లి తండాల్లో ఆమె సీసీ, వీఓఏలతో పర్యటించారు. మహిళా గ్రూపులను సందర్శించి మాట్లాడారు. తీసుకున్న రుణాలకు మొండి బకాయిలు సకాలంలో చెల్లించినట్‌లైతే ప్రోత్సాహక రూపకంగా బ్యాంక్‌లు మరిన్ని అప్పులు ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ రామయ్య, విజయలక్ష్మి, వీఓఏలు విజయ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్వో పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు: పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పచ్చని పూలు, విద్యుత్‌కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు సాయంత్రం ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యా హవాచనం, గణపతి యజ్ఞం నిర్వహించారు.

దేవాలయ అభివృద్ధికి కృషి

శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



ఆలయ నిర్మాణానికి చెక్కు ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: శిథిలమైన ఆలయాలను పునరుద్ధరిస్తూ, నూతన ఆలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హర్యా నాయక్ తండాలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ మేరమ్మయాడి ఆలయాన్ని నిర్మించేందుకు రూ. లక్ష యాభైవేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయడంలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో చందూ, రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, మల్లేష్ నాయక్, హనుమంతు నాయక్, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి

పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్

మంచాల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని మంచాల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. మంచాల గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నీళ్ల అభి, ప్రధానోపాధ్యాయురాలు రజినీ, ఉపాధ్యాయురాలు జ్యోతి, ధనలక్ష్మి, భవానీ, మహిత, స్వప్న, కవిత, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కలికిదొనగుట్ట

- దర్శనీయం.. స్వామి వారి ఆలయం
- 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- సంతాన గోపాలస్వామిగా ప్రసిద్ధి



కలికిదొనగుట్ట గోపాలస్వామి దేవాలయం

తలకొండపల్లి: కలికిదొనగుట్ట గోపాలస్వామి కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా స్వామి వారిని కొలుస్తున్నారు. ఈ ఆలయంలో నిద్ర చేస్తే చీడ, పీడ, దుష్ట శక్తులు దరిచేరవని భక్తుల నమ్మకం. శారీరక, అనారోగ్య, సమస్యలు, ఆర్థిక నష్టాల నుంచి కొంత వరకు బయట పడతారని విశ్వాసం. ఇక్కడి కోనేటిలో స్నానం చేసినా, నీటిని తలపై పోసుకున్నా సకల పాపములు తొలగుతాయని ప్రతీతి. సంతానం లేని వారికి పిల్లలు కలుగుతారని పూర్వికుల నుంచి వస్తున్న నమ్మకం. దీంతో ఇక్కడి దేవాలయానికి రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు తరలివస్తారు. సెలవు రోజులతో పాటు, శని, ఆది వారాల్లో వచ్చి సత్యనారాయణ వ్రతాలు, తలనీలాలు, పుట్టు వెంట్రుకలు వంటి మొక్కులు చెల్లించుకుంటారు.

నగరానికి సమీపంలో..

హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై, నగరానికి సమీపంలో సుమారు 60 కిలోమీటర్ల దూరంలో, ఆమనగల్లు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో మండల పరిధిలోని చుక్కాపూర్ శివారు ప్రాంత సమీపంలో ఈ కలికిదొనగుట్ట గోపాలస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి వచ్చే భక్తులకు మానసికమైన ప్రశాతంతతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవడుతాయని స్థానికులు చెబుతున్నారు.

ఆలయ విశిష్టత...

రుక్మిణీ సత్యభామ సమేత కలికిదొన గోపాల స్వామి స్వయం భూగా మర్రి చెట్టు కింద వెలిశారు. దీంతో అక్కడ ఆనాటి పూర్వీకులు ఆలయం నిర్మించినట్లు సమాచారం. నాటి నుంచి నేటి వరకు పూజలు నిత్యం చేస్తున్నారు. గాలిగోపురం, లక్ష్మిగణపతి, నవగ్రహాలు, ఈశ్వరుడు, ఆంజనేయులు, తదితర విగ్రహాలను ప్రతిష్ఠించారు.

రేపటి నుంచి..

ఈ నెల 18న ప్రారంభమై 23 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ సిద్ధాంతి పట్టాభిరామశర్మ తెలిపారు. మొదట గణపతిపూజ, పుణ్యాహవాచనము అంకురార్పణ, ఉదయం 11.30 గంటలకు గోపాలస్వామి కల్యాణం, రాత్రికి హనుమంత వాహనము, 19రాత్రి గరుడ వాహనసేవ, 20న పూల రథం, 21 రాత్రి రథోత్సవం, 22 రాత్రి గజవాహనము, తేపోత్సవము, 23 ఉదయం 11 గంటలకు చక్రతీర్థం, అవభృథస్నానం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించబడునని ఆయన తెలిపారు.

ఇబ్బందులు రానివ్వం



ప్రతి ఏటా సాంప్రదాయ బద్ధంగా పాల్గుణ శుద్ధ నవమి మొదలు త్రయోదశి వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సకల సదుపాయాలు కల్పించాం. వేసవి కాలంలో ఆలయ ఆవరణలో టెంట్లు, చలువ పందిళ్లు వేయించాం. భక్తులకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

– పట్టాభిరామ శర్మ, సిద్ధాంతి, ఫౌండర్ ట్రస్టు చైర్మన్, చుక్కాపూర్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కడ్తాల్: పోషకాహార ప్రాధాన్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్ కళావతి

తలకొండపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల పేర్కొన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు, మిలెట్స్, తదితర పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నట్‌లైతే ఆరోగ్యం పదిలంగా ఉండడమే గాకుండా వ్యాధులు దరి చేరవన్నారు. వెల్జాల్ మూడో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా చౌకగా దొరికె ఆకుకూరలు, కాయగూరలతో పోషకాహారాన్ని తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం తిరుమల మాట్లాడుతూ ఆహారలేమితో గర్భిణులు, కిశోర్ బాలికలు, తల్లులు, మహిళల్లో రక్తహీనత, వచ్చే ప్రమాదముందన్నారు. ప్రోటీన్లు, విటమిన్లు వంటి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనతను నివారించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నస్రీన్ బేగం, వసంత, లక్ష్మి, భూషణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్ కళావతి అన్నారు. శనివారం గడ్డమీదితండా అంగన్‌వాడీ పాఠశాలలో పోషణ పక్షం, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల చిరుధాన్యాలతో పోషకాహారం ఏ విధంగా లభిస్తోందో, చిన్నారులకు, తల్లులకు వివరించారు. చిరుధాన్యాల ద్వారా ప్రోటీన్స్, విటమిన్స్ లభిస్తాయని తద్వారా చిన్నారుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాస నిర్వహించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న విప్లవ్‌కుమార్, శివ తదితరులు

యాచారం: కొత్తపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం గ్రామంలోని యువజన సంఘాల సభ్యులు కంబాలపల్లి విప్లవ్‌కుమార్, పాలే శివ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసి మంచి గ్రేడ్లు, మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు రంజిత్, కొండల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలుస్తుంది



మాట్లాడుతున్న సికిందర్‌రెడ్డి

మంచాల: రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని యువజన కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం నియోజక వర్గం ప్రధాన కార్యదర్శి వెదిరె సికిందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంచాలలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు అందజేసిందన్నారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. ప్రతీ కుటుంబానికి రూ.10లక్షల ఆరోగ్య బీమా, 37వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రతి ఇంటికి రూ.500 లకే వంటగ్యాస్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు రావుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుడిగల పరమేష్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టపరిహారం అందేలా చర్యలు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: బండరావిరాల గ్రామంలోని మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గత ప్రభుత్వం గ్రామానికి చెందిన 50మంది భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందిస్తున్నట్లు ప్రకటించి చెక్కులు పంపిణీ చేయకపోవడంతో బాధిత రైతులు శనివారం మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనను కలిసి తమ సమస్య తెలియజేశారు. ఈ విషయంలో స్పందించిన ఎమ్మెల్యే రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి రైతులకు నష్టపరిహారం అందించాలని సూచించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు కొత్త అరుణ్ కుమార్ గౌడ్, ఓరుగంటి శివ రామకృష్ణ, బంగారి శివశంకర్, కుర్రిబలరాం, మొలుగు అర్జున్, రైతులు బంగారి మైసయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



మరమ్మతులు చేయిస్తున్న నరేందర్‌రెడ్డి

యాచారం: వేసవిలో తాగునీటి ఎద్దడి రానియొద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అధికారులతో పేర్కొన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. మిషన్ భగీరథ నీళ్ల సరఫరా అవుతున్నాయా? తాగునీటి ఇబ్బందులు ఉన్నాయా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. యాచారం నుంచి మొండిగౌరెల్లి గ్రామానికి వెళ్లే దారిలో డ్రైనేజీ నీరు పారడం గమనించారు. వేసవి దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలోని బోరుబావులను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

రాజీతో కేసుల సత్వర పరిష్కారం



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జడ్జి శంకర్ శ్రీదేవి

ఆమనగల్లు: లోక్ అదాలత్‌లో కేసులను రాజీతో పరిష్కరించుకోవాలని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమన్నారు. చిన్నచిన్న కేసులకు సంబంధించి రాజీపడే అవకాశం ఉన్నప్పుడు ఇరువర్గాలు మాట్లాడుకొని రాజీ చేసుకోవాలని ఆమె సూచించారు. మొత్తం 1,609 కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, రామకృష్ణ, ఏపీపీ కార్తీక్, మాడ్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్, ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం, న్యాయవాదులు శేఖర్, మల్లేశ్, జగన్, శ్రీను, మధు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని ఇబ్రహీంపట్నం సివిల్ కోర్టు ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి పేర్కొన్నారు. ఆదిబట్ల పీఎస్ పరిధిలో 623 కేసులు, ఇబ్రహీంపట్నం పరిధిలో 493, యాచారం పీఎస్ పరిధిలో 457, మంచాల పీఎస్‌పరిధిలో 436, గ్రీన్ ఫార్మసిటీ పీఎస్ పరిధిలో172 పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ నిరంతరం ఘర్షణలు పడి పీఎస్‌లకు వెళ్లకూడదన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్, ఏపీపీ వరలక్ష్మి, ఏపీపీ అరుణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి జగన్, కార్యదర్శి మురళి, ధనుంజయ్య, అంబచారి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యం ఖూనీ



ఆమనగల్లు: బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఇబ్రహీంపట్నం: అరెస్టును నిరసిస్తూ ఊరేగింపులో మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



కడ్తాల్: ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుపై బీఆర్ఎస్ శ్రేణులు బగ్గుమన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అరెస్టు నిరసిస్తూ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌లు కుమ్మక్కై బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. చిలుకల బుగ్గరాములు, మొద్దు అంజిరెడ్డి, జెర్కొని రాజు, ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ జంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖూనీ చేస్తున్నాయని, జెడ్పీటీసీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి, ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, ప్రియా రమేశ్, మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహరెడ్డి, తులసీరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: మిషన్ బగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ సభ్యులు అనురాధ, దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావ్‌లు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్‌అధ్యక్షుడు పత్యానాయక్, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, సరిత పంతునాయక్, సయ్యద్ ఖలీల్, రమేశ్, శంకర్, భీమయ్య, గుత్తి బాలస్వామి, జగన్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జీఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: మండల కేంద్రం నుంచి బీజేవైఎం, బీజేపీ నాయకులు ప్రధాని మోదీ సభకు తరలి వెళ్లారు. అసెంబ్లీ కన్వీనర్ అనిల్, శాంతకుమారి, యాదయ్య, కుమార్, గణేష్, వెంకటయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే బంగారు భవిష్యత్

అక్షర స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసురెడ్డి

తలకొండపల్లి: ఉపాధ్యాయుల సూచనలు, సలహాల మేర చదివినట్‌లైతే ఉన్నత లక్ష్యాన్ని సాధించొచ్చని అక్షర స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసురెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని అక్షర స్కూల్లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ద్వారానే బంగారు భవిష్యత్‌కు పునాది పడుతుందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణంగా చదివినప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలుగుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నిర్వహించిన ఆట, పాటలు సాంస్కృతిక, నృత్య, డ్యాన్స్ ప్రదర్శనలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసురెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, ఉపాధ్యాయులు సరిత, నసీం, దీప్తి, స్వాతి, ధరణి, రాధిక, విమల, దివ్య, సమ్రిన్, అశ్విని, సురేశ్, మమత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్

కడ్తాల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్ అన్నారు. రావిచేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయలక్ష్మి ఉద్యోగ విరమణ చేశారు. శనివారం పాఠశాలలో విజయలక్ష్మీ దంపతులను పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే శక్తి ఒక్క ఉపాధ్యాయులకే ఉంటుందని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి ఆమె చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ రవి, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశానికి లభించిన గొప్ప ఆస్తి అంబేడ్కర్

- జాతర కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సుధాకర్
- విగ్రహావిష్కరణ కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేసిన నాయకులు

తలకొండపల్లి: అంబేడ్కర్ ప్రపంచ మహామేధావి అని, ఆయన దేశానికి లభించిన గొప్ప ఆస్తి అని పూలే అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ జి సుధాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో మార్చి 26న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా శనివార కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ భారత దేశానికి దశ దిశ చూపించిన మహోన్నతమైన వ్యక్తని చెప్పారు. అన్యాయాలు, అసమానతలు, అణచివేతలు, అవమానాలకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమ పోరాటలు చేసి, కేంద్ర, రాష్ట్ర శాసన సభలకు ఎన్నికైన మొదటి న్యాయశాఖ మంత్రిగా పని చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘాయిపల్లి సుధాకర్, మాజీ జెడ్పీటీసీ నరసింహ్మా, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాం, మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్ యాదవ్, రఘురాములు, తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభకు బీజేపీ శ్రేణులు



మాడ్గుల నుంచి వెళ్తున్న బీజేపీ నాయకులు

మాడ్గుల: నాగర్ కర్నూల్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ సంకల్ప సభకు మాడ్గుల నుంచి బీజేపీ నాయకులు కార్యకార్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మండల పరిధిలోని పలు గ్రామల నుంచి కార్యకార్తలు, నాయకులు ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. మాడ్గుల మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, మాదాసు వెంకటయ్య గౌడ్, అశోక్, ద్రోణ చారి, రాజు రెడ్డి, హరిష్ రెడ్డి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని మండల అధ్యక్షుడు మాన్యనాయక్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌కు మద్దతుగా, ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు మండల కేంద్రం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో తరలివెళ్లారు. జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, బ్రహ్మచారి, అశోక్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



చరికొండ వేణుగోపాలస్వామి రథోత్సవం

కడ్తాల్: చరికొండ గ్రామంలోని వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం నిర్వహించారు. వేదపండితులు చక్రవర్తి శ్రీనివాసచార్యులు కృష్ణమాచార్యులు, వేణుగోపాలచార్యులు, తిరుమలకిరణ్‌చార్యులు, రామయ్యచార్యుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రుక్మిణీ సత్యభామ శ్రీ వేణుగోపాల స్వామి విగ్రహాలను అధిష్ఠింపజేసి ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి రథోత్సవంలో పాల్గొన్నారు. వేణుగోపాల నామస్మరణతో ఇరువైపులా రథాన్ని లాగారు. యువకులు, భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఎంపీటీసీ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ భారతమ్మ నర్సింహగౌడ్, బాలకృష్ణగౌడ్, భీష్మాచారి, రాజీవ్‌గౌడ్ లక్ష్మయ్యగౌడ్, సత్యశీలారెడ్డి పాల్గొన్నారు.